క్లుప్తంగా

'రైతులకు బోనస్ ఇచ్చి ఆదుకోవాలి'

ఇచ్చోడ: ఈ ఏడాది భారీగా కురిసిన వర్షాలకు పంటలు దెబ్బ తిని రైతులు నష్టపోయారని, పత్తి, సోయా, మొక్కజొన్న పంటలకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ చెల్లించి రైతులను ఆదుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. బోనస్ ఇచ్చి ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. గత ఏడాది రబీలో రైతుబంధు ఇవ్వకుండా ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు కష్టాలు మొదలయ్యాయని ఆరోపించారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా మొక్కజొన్న పంట కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యవతి కుంరకోటేశ్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ శేషారావు, ఏనుగు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, గాడ్గే సుభాష్, పాండురంగ్, సీహెచ్ భూమన్న పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

ఇచ్చోడ: మండలంలోని కామాగిరిలో ఆదివారం పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశువులకు చెవిపోగుల ఆధార్ కూడా వేసినట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న టీకాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం గ్రామాలకు వస్తున్న పశువైద్య సిబ్బందికి పశువులు అందుబాటులో ఉండే విధంగా రైతులు చూడాలని కోరారు. కార్యక్రమంలో పశు సహాయకురాలు సంధ్య, శేఖర్, రమేశ్, ఉదయ్, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

'చిన్నారులను పనిలో పెట్టుకోవద్దు'

ఆదిలాబాద్: చిన్నారులను పనిలో పెట్టుకుంటే యజమానులపై చర్యలు తప్పవని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జి. రాజలింగు హెచ్చరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రామ్‌లీలా మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాల వద్ద అవగాహన కల్పించారు. 18 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవద్దని సూచించారు. క్రాకర్స్ షాప్స్ ప్రమాదకరమైనవని పనులో పెట్టుకున్న సంబంధిత షాప్ యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. రెండు రోజుల పాటు శాఖ తరపున తనిఖీలు చేస్తామన్నారు. ఆపదలు ఉన్న పిల్లల కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, 100కి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్, క్రాకర్ షాప్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజేందర్, షూర్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ కె. వినోద్, ఫీల్డ్ సూపర్‌వైజర్లు కిరణ్, సౌజన్య, అనిల్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా కుబేరలక్ష్మీ సహస్ర కుంకుమ పూజలు



కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న మహిళలు

తాండూర్: ధనత్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో కుబేర లక్ష్మీ సహస్ర కుంకుమార్చన కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఆలయ పూజారి నవీన్‌శర్మ, వేదపండితుడు వినోద్‌శర్మల ఆధ్వర్యంలో 108మంది సుహాసినులతో నిర్వహించిన ఈ కుంకుమార్చన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

ఉద్యోగ నియామకపత్రం అందజేత

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ అంబేద్కర్ నగర్ బస్తీకి చెందిన ముత్తే రమ్య అనే యువతి గ్రూపు–2 ఉద్యోగ నియామకపత్రాన్ని అందుకుంది. హైదరాబాద్ మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి బెన్హర్ మహేష్ దత్ ఎక్కా చేతుల మీదుగా రమ్య సచివాలయంలోని జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో అసిస్టెంట్ సెక్షన్ అధికారిగా ఉద్యోగ నియామకపత్రాన్ని స్వీకరించారు.

ట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజు ఎన్నిక

బెల్లంపల్లి: బెల్లంపల్లి ట్రాక్టర్ అసోసియేషన్ ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపించాయి. ఇదివరకు ఎన్నడూ లేనివిధంగా అధ్యక్ష పదవి కోసం నలుగురు ట్రాక్టర్ యజమానులు పోటీ పడ్డారు. ఏకగ్రీవంగా ఎన్నిక నిర్వహించేందుకు కొందరు చేసిన యత్నాలు ఫలించలేదు. పోటీ తీవ్రంగా ఉండటంతో అనివార్యంగా ఎన్నిక నిర్వహించాల్సి వచ్చింది. ఆదివారం ఎన్నికలు జరగ్గా వరుకుట్టి రాజు 3ఓట్ల ఆధిక్యంతో అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. రాంనగర్ బస్తీకి చెందిన రాజు పోటాపోటీ ఎన్నికల్లో విజయం సాధించడంతో పలువురు ట్రాక్టర్ యాజమానులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

జీవాల బెడద..!

- గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు, పశువులు
- ఇళ్లలోకి చొరబడుతున్న కోతులు
- దోమల వ్యాప్తితో వ్యాధులు
- పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు



పెట్రోల్ పంప్ ఏరియాలో రోడ్డుపై గుంపులుగా కుక్కలు



అంబేడ్కర్ చౌరస్తా వద్ద రోడ్డుపైన పశువులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీతో పాటు మండలంలో కుక్కలు, పశువులు, కోతులు, దోమల బెడద తీవ్రమవుతోంది. వీటి నియంత్రణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఏ వీధిలో చూసినా కుక్కలే..

పట్టణంలో కుక్కలను నియంత్రిస్తామని మున్సిపాలిటీ అధికారులు చెబుతున్నా ఆశించిన స్థాయిలో ఫలితం కానరావడంలేదు. ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. రాత్రివేళలో వాహనదారులను తరుముతున్నాయి. దీంతో వారు ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఇళ్లలోకి కోతులు..

మున్సిపాలిటీ పరిధిలోని కాపువాడ, సీబాపుకాలనీ, సంజీవయ్య కాలనీ, ద్వారకానగర్, బాలాజీనగర్ తదితర కాలనీలో కోతులు గుంపులుగా వచ్చి ఇండ్లలోకి చొరబడి అందిన వస్తువులను లాక్కుని వెళ్తున్నాయి. ఇటీవల పట్టణంలోని ద్వారకానగర్ కాలనీలోని ఓ కిరాణా షాపులో నుంచి కోడిగుడ్లను తీసుకెళ్లినట్లు దుకాణ యజమానులు పేర్కొంటున్నారు.

యథేచ్ఛగా పశువుల సంచారం

కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన వీధులతో పాటు అంతర్గత రోడ్లపై పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. పశువులు తిరగకూడదని మున్సిపల్ అధికారులు ఆదేశాలు జారీ చేసినా, వాటి యజమానులు బేఖాతరు చేస్తున్నారు. ప్రధానంగా రాజీవ్‌గాంధీ చౌరస్తా, లారీ చౌరస్తా, ఇందిరా మార్కెట్, పెట్రోల్ పంప్ తదితర ప్రాంతాల్లో సమస్య తీవ్రంగా ఉంది. వీటి కారణంగా ట్రాఫిక్ సైతం స్తంభిస్తోంది. వీటిపై అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

దోమల బెడద..

పట్టణంలో పారిశుద్ధ్యం లోపిస్తుంది. దీంతో పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ నీరు నిలిచిపోతోంది. మరోవైపు ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు, లోతట్టు ప్రాంతాల్లో మురుగు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. వీటి వల్ల దోమల బెడద ఎక్కువవుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో దోమలతో వ్యాధులు విజృంభిస్తున్నా వైద్యఆరోగ్యశాఖ, మున్సిపల్ అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఫాగింగ్ చేయాల్సిన సిబ్బంది పూర్తిగా విస్మరించారు. దోమల నుంచి తప్పించుకునేందుకు మెష్‌డోర్లు, తలుపులు, కిటికీలు మూసి వేస్తున్నా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

చర్యలు చేపట్టాలి..



నిత్యం ఏదో ఒక పనిపై పట్టణంలోని మార్కెట్‌కు వెళ్లాల్సిందే. రోడ్లపై పశువుల సంచారం అధికంగా ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. వాటి సంచారంపై అధికారులు చర్యలు చేపట్టాలి.

– సోను, కాగజ్‌నగర్

కుక్కలతో బేజారు



కుక్కల బెడద తీవ్రంగా ఉంది. చిన్న పిల్లల విషయంలో మరింత ఆందోళన పడాల్సి వస్తోంది. ఏ వీధిలో చూసినా గుంపులుగా కుక్కలు సంచరిస్తున్నాయి. రాత్రి వేళలో ఇళ్లకు చేరే క్రమంలో కుక్కలు వెంటపడుతున్నాయి.

– శ్రీనివాస్, సీబాపుకాలనీ

వస్తువులు ఎత్తుకెళ్తున్నాయి



ఉదయం అయితే చాలు కోతులు ఎవరూ లేని సమయంలో ఇళ్లలోకి చేరి ఇంట్లోని వస్తువులను ఎత్తుకెళ్తున్నాయి. రెండు రోజుల క్రితం షాపుల్లోని చిప్స్ ప్యాకెట్స్, కోడిగుడ్లు ఎత్తుకెళ్లాయి. వాటిని బెదిరిస్తే దాడులు చేస్తున్నాయి.

– శ్రీకాంత్, ద్వారకానగర్

ఆదివాసీలకు రోడ్డు కష్టాలు



చాల్‌బాడీ గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న కాలువ

- ఏళ్లు గడుస్తున్నా కచ్చా రోడ్లే దిక్కు
- పట్టించుకోని పాలకులు
- చెత్తబుట్టల్లో వినతులు



పాటగూడ వద్ద కంకర లేచి అధ్వానంగా ఉన్న బీటీ రోడ్డు

కెరమెరి: గిరిజన గ్రామాల్లో బీటీ రోడ్లు వేసి ఆదివాసీల కష్టాలు తీరుస్తామని చెబుతున్న పాలకుల మాటలు నీటి మూటలవుతున్నాయి. ఫలితంగా ఏళ్లు గడుస్తున్నా రహదారి కష్టాలు తప్పడం లేదు. టెమ్లాగూడలో 17 కుటుంబాలు ఉండగా 130 మంది జనాభా నివసిస్తున్నారు. కొలాంగూడలో 32 కుటుంబాల్లో 177 మంది, గొర్యాగూడలో 25 కుటుంబాల్లో 130 మంది, పాటాగూడలో 42 కుటుంబాల్లో 201 మంది గిరిజనులు, చాబాడీలో మూడు కుటుంబాల వారు జీవిస్తున్నారు. వారికి రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాయకులు, పాలకులు మారుతున్నా వారికి రోడ్డు సౌకర్యం కల్పించడంలో మాత్రం అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా గ్రామాలను సందర్శించి ఓట్ల కోసం అమలు కాని హామీలు గుప్పిస్తూ అమాయక ప్రజలను బురిడీ కొట్టించి తమ వైపు ఓట్లు వేయించుకుంటున్నారు. ఆ తర్వాత వారి గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. టెమ్లాగూడ, గొర్యాగూడ, కొలాంగూడ గ్రామాలకు దేవాపూర్ నుంచి సుమారు కిలోమీటరు వరకు పూర్తిగా కచ్చా రోడ్డు ఉంది. వర్షాకాలంలో మోకాళ్లోతూ బురద ఉండడంతో నడక నరక ప్రాయంగా మారింది. చాల్‌బాడికి వెళ్లేందుకు పాటగూడ వరకు మాత్రమే బీటీ రోడ్డు ఉంది. తర్వాత కచ్చా రోడ్డుతో అడవుల్లోంచి వెళ్లాల్సి వస్తుంది. పట్నాపూర్ క్రాస్ రోడ్డు నుంచి పాటాగూడ వరకు ఉన్న బీటీ రోడ్డు కూడా పూర్తిగా అధ్వానంగా మారింది. ఇకనైనా అధికారులు స్పందించి ఆయా గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు.

వంతెనలు లేక..

చాల్‌బాడీ గ్రామానికి వెళ్లేదారిలో పాటగూడ వద్ద ఉన్నకాలువపై, టెమ్లాగూడ, గొర్యాగూడ, కొలాంగూడకు వెళ్లే దారిలో ఉన్న ఖట్టిగూడ వద్ద ఉన్న వాగుపై వంతెనలు నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు. ఎగువ ప్రాంతాల్లో ఏ కొంత వర్షం కురిసినా రాకపోకలు నిలిచిపోతున్నాయి. గ్రామీణ ప్రజల సౌకర్యార్థం వంతెనలు నిర్మించాలని వారు కోరుతున్నారు.

తప్పని ఇబ్బందులు



రోడ్డు బాగా లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. గడిచిన కొన్నేళ్లుగా మా రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డుకు మరమ్మతులు చేపట్టడం లేదు. పూర్తిగా కంకర లేచి నడిచేందుకు యోగ్యంగా లేదు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

– ఆత్రం పాపుగా, పాటగూడ

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న అంబేడ్కర్ సంఘం నాయకులు



దహెగాం: మాట్లాడుతున్న నాయకులు

పెంచికల్‌పేట్: దహెగాం మండలంలోని గెర్రె గ్రామంలో నిండు గర్భిణీ తలండి శ్రావణిని హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కోట సతీశ్ డిమాండ్ చేశారు. ఆదివారం మురళీగూడ గ్రామంలో మాట్లాడుతూ కొడుకు కులాంతర వివాహం చేసుకున్నారనే కోపంతో కోడలిని పాశవికంగా హత్య చేయడం దారుణమన్నారు. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెస్తున్నా నేటికీ గ్రామాల్లో కులవివక్ష పోవడం లేదన్నారు. తలండి భాస్కర్, సాగర్, సాయి, పెంటయ్య, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

దహెగాం: గర్భిణీ అని కూడా చూడకుండా కిరాతకంగా గొడ్డలితో దాడి చేసి హత్య చేసిన శివార్ల సత్తయ్యను కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం హత్యకు గురైన శ్రావణి అంత్యక్రియల్లో ప్రజా సంఘాలు టీపీజీఎస్, డీవైఎఫ్ఐ, ఏఐఏడబ్ల్యూయూ నాయకులు పాల్గొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కోట శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నేర్పెల్లి అశోక్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిశెల కార్తీక్, ప్రజా సంఘాల నాయకులు టీకానంద్, నిఖిల్, తిరుపతి, బక్కన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: శ్రావణిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి కూశన రాజన్న ఆదివారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రావణి హత్య కుల దురాహంకార హత్య అని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా పోలీసుశాఖ దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. శ్రావణి కుటుంబానికి న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు.

పంట పొలాల్లో ప్రకృతి సోయగం







లింగాపూర్: వర్షాలు విస్తారంగా పడడంతో ప్రకృతి ఒడిలోని బీడు, నల్లరేగడి భూములు పచ్చిక బయళ్లతో కనువిందు చేస్తున్నాయి. వీటిలో పూసిన వివిధ రకాల గడ్డిజాతి పూలు సుగంధ పరిమళాలు వెదజల్లుతున్నాయి.





వీధి వ్యాపారులకు రుణాలు!

- లోక్ కల్యాణ్ మేళా పేరిట అవగాహన కార్యక్రమాలు
- రుణాల మంజూరుకు చర్యలు



కాగజ్‌నగర్ పట్టణంలో వీధి వ్యాపారుల వివరాలు నమోదు చేస్తున్న మున్సిపల్ అధికారులు (ఫైల్)

కాగజ్‌నగర్‌టౌన్: వీధి వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి స్వనిధి రుణాలు ఇచ్చేందుకు ముందుకొచ్చింది. వీధి వ్యాపారులకు ఈ రుణాలపై అవగాహన కల్పించేందుకు 'లోక్ కల్యాణ్ మేళా' పేరిట మార్చి 17 నుంచి అక్టోబర్ 2 వరకు మున్సిపాలిటీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వీధి వ్యాపారులకు రుణాలు అందించేందుకు మెప్మా సిబ్బంది దరఖాస్తులు స్వీకరించి మంజూరు చర్యలు చేపట్టింది. జిల్లాలోని 2 మున్సిపాలిటీల పరిధిలో వీధి వ్యాపారులను గుర్తించి సర్వే చేపట్టారు. కొందరు వీధి వ్యాపారులకు ఒకట్రెండు విడతలుగా రుణాలు మంజూరు చేశారు. ప్రస్తుతం మూడో విడత తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు.

కొత్తవారికి అవకాశం

ఐదేళ్ల కిందట వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు అందించారు. వడ్డీ వ్యాపారులతో ఇబ్బందులు పడకుండా బ్యాంకుల ద్వారా నేరుగా స్వల్పకాలిక రుణాలు అందించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికే ఇన్నాళ్లు రుణాలు అందించారు. ఇప్పుడు ప్రత్యేకంగా క్యాంపులు ఏర్పాటు చేసి పాత వారితో పాటు కొత్తవారికి అవకాశం కల్పించారు.

పెరిగిన రుణ పరిమితి

వీధి వ్యాపారులకు అందించే రుణ పరిమితిని సైతం పెంచారు. మొదటి విడతలో రూ.10వేలు అందించగా ప్రస్తుతం లోక్ కల్యాణ్ మేళా ద్వారా రుణాన్ని రూ.15వేలకు పెంచారు. రెండో విడత రూ. 25వేలు, మూడో విడత రూ. 50వేలకు పెంచి రుణాన్ని అందించనున్నారు. మొదటి, రెండో విడతలో సక్రమంగా చెల్లించిన వారిని రూ.50వేల రుణానికి ఎంపిక చేయనున్నారు.

మున్సిపాలిటీలకు లక్ష్యం..

కొత్త లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మున్సిపాలిటీలకు లక్ష్యం విధించింది. 2025–26లో ఆసిఫాబాద్‌కు మొదటి విడతలో 184, 2వ విడతలో 92, మూడో విడతలో 28, 2026 –27 సంవత్సరానికి మొదటి విడతలో 277, రెండో విడతలో 138, మూడో విడతలో 41 మందికి అలాగే కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి 2025 –26 సంవత్సరానికి మొదటి విడతలో 201, రెండో విడతలో 31, మూడో విడతలో 28 మంది, 2026 –27 సంవత్సరానికి మొదటి విడతలో 301, రెండో విడతలో 46, మూడో విడతలో 30 మంది వీధి వ్యాపారులను గుర్తించి రుణాలు అందజేయనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



పీఎం స్వనిధి పథకం కింద అందించే రుణాలను వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందించే రుణాలు తీసుకొని తమ వ్యాపారాన్ని విస్తరించుకొని ఆర్థికంగా బలపడాలి. కొత్త సంఘాలకు ఈ రుణాలు వరం.

– రాజేందర్, మున్సిపల్ కమిషనర్

'ధ్యానంతోనే ఆరోగ్య సంరక్షణ'

ఆదిలాబాద్‌టౌన్: ధ్యానంతోనే ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని వయోవృద్ధుల సమైఖ్య అధ్యక్షుడు డాక్టర్ దేవిదాస్ దేశ్‌పాండే అన్నారు. ఆదివారం వయోవృద్ధుల కార్యాలయంలో శ్రీరాంచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో ధ్యానం నిర్వహించారు. నిత్యం యోగా, ధ్యానం చేయడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో ఉపశమనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సునీత, శేఖర్, కిషన్, కిషోర్, దేవన్న, దయాకర్‌రెడ్డి, శ్యామ్, రాజాగౌడ్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

వారసంత.. రాకపోకల తంటా



ట్రాఫిక్‌లో ఇరుక్కున్న ఆర్టీసీ బస్సు

బెజ్జూర్: మండల కేంద్రంలో ప్రతీ ఆదివారం నిర్వహించే వారసంతతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రధాన రహదారిపై నిర్వహిస్తున్న దుకాణ సముదాయాలతో ఆర్టీసీ బస్సులు వెళ్లలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. రోడ్డుకు రెండు వైపులా దుకాణాలు ఏర్పాటు చేయడం, ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో ఎదురెదురుగా రెండు బస్సులు ఒకేసారి వస్తే ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై వాహనాలు, దుకాణ సముదాయాలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న దండారీ ఉత్సవాలు

బజార్‌హత్నూర్: మండలంలోని ఆదివాసీ గిరిజన గూడెల్లో దండారీ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఘచింతలసాంగ్వీ, మాడగూడ, జాతర్ల, అందుగూడ, ఉప్పర్‌పల్లి, భూతాయి, గిరిజయి, డేడ్ర, కొత్తపల్లి గ్రామాల్లో గుస్సాడీల డెంసా నృత్యం చేశారు. రేలా రేలా పాటలతో సందడి చేశారు. గ్రామాల నుంచి వచ్చిన గుస్సాడీలకు స్వాగతం పలికి విందు భోజనాలు ఏర్పాటు చేశారు.

బోథ్: ఆదివాసీ సంస్కృతికి ప్రతీకగా నిలిచే దండారీ ఉత్సవాలు బోథ్ మండలంలోని ఇంకరిగూడ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు వనవాసీ కల్యాణ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్ రావు, దేశ్‌పాండే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంస్కృతికి మూలం ఆదివాసీలని, భారతదేశం యొక్క ఆత్మ నగరాలు, పట్టణాల్లో కాకుండా ఆదివాసీ సమాజంలోనే కనిపిస్తోందన్నారు. రాణి దుర్గావతి, బిర్సాముండా, కుమురం భీం ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.